జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బుధవారం | 14-5-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 338 పేజీలు: 4 వెల : రూ.7




## అంతు చూస్తున్న..
# అక్రమ సంబంధాలు



* పోలీస్‌స్టేషన్లలో అధికంగా ఇటువంటి కేసులే నమోదు
* భార్యభర్తలకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు
* ఇతరుల మోజులో పడి కుటుంబాలకు దూరం
* అవమానాలు ఎదుర్కొంటున్న కుటుంబాలు
* రోడ్డున పడుతున్న పిల్లలు
* సభ్య సమాజం తలదించుకునేలా ఘటనలు



**శ్రీకాకుళం క్రైం, మే 13 (వార్త):** వివాహేతర సంబంధాలు.. కుటుంబాలను రోడ్డున పడేస్తున్నాయి. ఏకంగా హత్యలకే దారితీస్తున్నాయి. జిల్లాలో ఇటువంటి ఘటనలు నిత్యం చోటుచేసుకుంటున్నాయి. భర్త వేరొకరికితో ఉంటున్నాడని భార్య, భార్య అక్రమ సంబంధం పెట్టుకున్నాడని భర్త గొడవలు పడి పోలీస్‌స్టేషన్‌కు ఎక్కుతున్నారు. ఇటువంటి ఘటనలు సభ్యసమాజం తలదించుకునేలా చేస్తున్నాయి. ఆయా కుటుంబాలు తలదించుకునే పరిస్థితులు తలెత్తుతున్నాయి. వారి పిల్లలు సైతం అవమానాలు ఎదుర్కోక తప్పడం లేదు. గత కొద్ది నెలలు కిందట ఆమదాలవలస మండలంలో ఓ మహిళ వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. చివరకు తన సన్నిహితులతో కలిసి భర్తనే ఏకంగా పొట్టనపెట్టుకున్న ఘటన సంచలనమైంది. ఇటీవల సంతబొమ్మాళి మండలంలో ఇటువంటిదే మరో ఘటన చోటుచేసుకుంది. కోటబొమ్మాళిలోని ఓ కానిస్టేబుల్‌తో అక్రమ సంబంధం పెట్టుకుందన్న అనుమానంతో భార్యను భర్త కత్తితో నరికిచంపాడు. సంతబొమ్మాళి మండలం నర్సాపురం గ్రామానికి చెందిన నర్శిపురం తిరుపతిరావు, లక్ష్మి కోటబొమ్మాళి విద్యుత్ నగర్‌లో నివాసముండేవారు. వారు తొలుత అన్యోన్యంగా జీవించేవారు. లక్ష్మి కోటబొమ్మాళిలో హర్షిణి బ్యూటీ పార్లర్ అండ్ లేడీస్ కార్నర్‌ను నిర్వహించేది. భర్త తిరుపతి రావు కేబుల్ ఆపరేటర్. కోటబొమ్మాళికి చెందిన ఓ కానిస్టేబుల్‌తో లక్ష్మికి పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం అక్రమ సంబంధానికి దారితీసిందని తిరుపతిరావు అనుమానం వ్యక్తం చేశాడు. దీంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరగడంతో కోటబొమ్మాళి పోలీస్ స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. దీనిపై దర్యాప్తు చేపట్టాలని శ్రీనివాసరావు పోలీసులకు సైతం గతంలో ఫిర్యాదు చేశాడు. అయినప్పటికీ వారిద్దరి మధ్య అ క్రమ సంబంధం కొనసాగుతుందనే అనుమానంతో బుధవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో భార్య లక్ష్మి బ్యూటీ పార్లర్‌లో ఉండగా భర్త తిరుపతిరావు నేరుగా కత్తితో వెళ్లి ఆమె పీకను కోసి పరారయ్యాడు. ఇటీవల విజయనగరం జిల్లాలో కూడా ఇటువంటి ఘటనే చోటుచేసుకుంది. పోలీస్‌స్టేషన్లలో సైతం ఇటువంటి కేసులే ఎక్కువగా నమోదవుతున్నాయి. పోలీసులు కౌన్సెలింగ్ చేస్తునే ఉన్నారు. అయినప్పటికీ వివాహేతర సంబంధాలు కొనసాగుతుండడం చివరికి హత్యలకు దారితీస్తోంది.

## ఆపత్కాలం..
# అప్రమత్తం!

* ప్రజలకు అవగాహన కల్పనకే మాక్‌డ్రిల్
* జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి



**శ్రీకాకుళం, మే13(వార్త):** అత్యవసర, ప్రమాద సమయంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆర్టీసీ కాంప్లెక్స్ లో మంగళవారం రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, ఎపి స్టేట్ డిజాస్టర్ మేనేజ్ మెంట్, తదితర శాఖలు సంయుక్తంగా మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉగ్రవాదులు, బాంబు పేలుడు, ఇతర దేశాల నుండి దాడి, జరిగితే ఏమి చేయాలి అనే అంశంపై మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. కలెక్టరేట్ లో ఉన్న కంట్రోల్ రూంకు ప్రమాదంపై కలెక్టరేట్ కు సమాచారం ఇస్తే అక్కడ నుండి పోలీసు, వైద్య ఆరోగ్య శాఖ, సివిల్ డిఫెన్స్, ఎపి స్టేట్ డిజాస్టర్ మేనేజ్ మెంట్, తదితర శాఖలు ప్రమాద స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు. ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే ఆమదాలవలస, పలాస రైల్వే స్టేషన్లో ప్రజలకు అత్యవసర, విపత్కర పరిస్థితులలో ఉగ్రవాద దాడులు జరిగినప్పుడు ఏ విధంగా స్వీయ రక్షణ పొందడం, పోలీసు, రెవిన్యూ, అగ్ని మాపక శాఖల వంటి ప్రభుత్వ విభాగాలు సహాయక చర్యలు చేపడతాయని ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కె. సాయి ప్రత్యూష, మునిసిపల్ కమిషనర్ ప్రసాద్ రావు, డిఎస్పీ సిహెచ్ వివేకానంద, ఎఆర్ డిఎస్పీ శేషాద్రి, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక



## గ్రంథాలయంలో విద్యార్థులకు పోటీలు

**మందస, మే 13(వార్త):** మందసలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు గ్రంథాలయాధికారిణి జె. విజయలక్ష్మి ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు కూడా ఎంతో అసవరమన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో నిర్వహించిన ఈ పోటీలను నిర్వహిస్తున్నామని విజయలక్ష్మి చెప్పారు. విద్యార్థినీ, విద్యార్థులకు బాటిల్ బాల్ గేమ్ ఆడించడం జరిగిందన్నారు. విద్యార్థులు ఆటలు ఆడాలని, దీంతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. గ్రంథాలయం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రంథాలయం గ్రంథాలయాధికారిణి జె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, స్థానికులు పాల్గొన్నారు.



# పోక్సో కేసుల దర్యాప్తులో పురోగతి సాధించాలి

**-నేరస్తులకు శిక్షలు పడేలా చూడాలి**

**- స్కూల్స్, కాలేజీల వద్ద పెట్రోలింగ్ పెంచాలి**

**-జిల్లా ఎస్పీ కె.వి మహేశ్వర రెడ్డి**



**శ్రీకాకుళం, మే 13(వార్త):** బాలికలు పై జరిగే శారీరక, లైంగిక వేధింపులు నేరాలు అరికట్టేందుకు నేరస్తలపై ఫోక్సో చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి ఫోక్సో చట్టాన్ని మరింత పటిష్టంగా అమలు చేయాలని,క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్ కేసులలో నేరస్తులకు శిక్షలు పడేలా కేసులు దర్యాప్తు ఉండాలి అని జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నుంచి జూమ్ కాన్ఫరెన్స్ (వర్చువల్) ద్వారా జిల్లా వ్యాప్తంగా ఉన్న డిఎస్పీ, సిఐ, ఎస్సై లతో ఫోక్సో ,క్రైమ్ అగైనస్ట్ ఉమెన్ కేసులు దర్యాప్తు,విచారణ,కేసు ఫైల్ ప్రస్తుత స్థితి, కేసులో సాదించిన పురోగతి తదితర అంశాలపై అదనపు ఎస్పి కెవి రమణ తో కలసి సమీక్షించారు.అపరిష్కృతంగా ఉన్న ఫోక్సో కేసులపై ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తులో పురోగతి సాధించాలని ఈ క్రమంలో ముందుగా పెండింగ్ ఫోక్సో కేసుల వివరాలను స్టేషను వారీగా క్షుణ్ణంగా పరిశీలించి కేసుల దర్యాప్తులో సాధించిన పురోగతి,సాంకేతిక ఆధారాలు,చేపట్టిన చర్యల పై ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మహిళలు, బాలికలు పై జరిగే నేరాలలో పిర్యాదు అందిన వెంటనే కేసు రిజిస్టర్ చేసి సమగ్రంగా కేసులు దర్యాప్తు చేపట్టాలన్నారు.క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్ కేసులో నిర్ణీత 60 రోజులు లోపాల కేసుల అభియోగ పత్రాలు పూర్తి స్థాయిలో దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో దాఖలు చేయాలన్నారు.సదురు కేసులు దర్యాప్తు పెండింగ్ నకు గల కారణాలు పై ఆరా తీసి నిశితమైన ఆధారాలతో కేసులు దర్యాప్తు పూర్తి చేయాలన్నారు.స్కూల్, కాలేజీల, పబ్లిక్ ప్రదేశాలలో సీసీ కెమెరాల ఏర్పాటు చేసి మహిళ భద్రత చర్యలు చేపట్టాలన్నారు. స్కూల్,కాలేజీల వద్ద శక్తీ బృందాలు తో పోలీసు పెట్రోలింగ్ పెంచాలన్నారు. విద్యార్థి,విద్యార్థినులకు ఫోక్సో,మహిళ చట్టాలు,గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అంశాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వంచాలని పలు అంశాలపై జిల్లా ఎస్పి దిశ నిర్దేశలు చేశారు. ఈ వర్చువల్ సమీక్షా సమావేశంలో జిల్లా పోలీసు కార్యాలయం నుంచి జిల్లా ఎస్పి తోపాటు అదనపు ఎస్పి కెవి రమణ, డిసిఆర్బి సీఐ శ్రీనివాసరావు, సైబర్ సెల్ సీఐ శ్రీనివాస్, ఎస్సైలు గోవింద రావు, నేతాజీ పాల్గొనగా, జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీసు అధికారులు వారి వారి పోలీసు స్టేషను, కార్యాలయాలు నుంచి పాల్గొన్నారు.

# భూ రీసర్వేలో నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలి



**కొత్తూరు, మే 13 (వార్త):** గత ప్రభుత్వం ఆదేశాలు మేరకు భూములు రీసర్వేలో నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం నాడు కొత్తూరు మండల తహశీల్దార్ బాలక్రిష్ణకి భూహక్కులు కలిగిన రైతులతో కలసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా సిర్ల ప్రసాద్, గేదెల క్రిష్ణారావు, పెదకోట యతిరాజు మాట్లాడుతూ సర్వం హక్కులు ఉన్న తమ భూమిలో వేరొకరిక నమోదు చేయడంపై కర్లెమ్మ రెవెన్యూ తమ భూమిలో సంభందం లేని వ్యక్తులకు రీ సర్వే లో ఎల్ పి ఎం నెంబర్ లలో జాయింట్ రైతులు పేర్లు నమోదు చేశారని, ఇలా తమ భూమిలో వేరొకరికి నమోదు చేయటం వల్ల నేటికీ సమస్య పరిష్కారం కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు.గతంలో టెక్కలి డివిజన్ %=ఞూ% కి కొత్తూరు గ్రామ సభకు వచ్చి నెలరోజుల్లో ప్రతీ రైతు సమస్యను పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు.కానీ నేటి వరకు కూడా రైతులు తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఉన్నా సమస్య మాత్రం పరిష్కారం కాలేదని అన్నారు. డి పట్టాలు కలిగిన రైతులకు ఎల్.పి.ఎమ్ నెంబర్ రావటం లేదు.దీనివల్ల రైతులు రైతు భరోసా కోల్పోయిన పరిస్థితి ఉన్నదని ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు భూ సర్వేలో జరిగిన లోపాలను సరిచేసి రైతులకు న్యాయం చేయాలని లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన బాట చేపడతామని అన్నారు. తహశీల్ధార్ మాట్లాడుతూ కార్లేమ్మ రైతుల అందరి సమస్యలు పరిష్కారం చేస్తామని చెప్పారు. ఈకార్యక్రమంలో ధర్మారావు, చిన్నారావు, గోపాలు, రామారావు తదితరులు పాల్గొన్నారు.



# పెలికాన్ పక్షికి గాయం..సపర్యలు

**పలాస, మే13(వార్త) :** సైబీరియాకు చెందిన విదేశీ అతిథి పెలికాన్ పక్షికి గాయాలు కావడంతో పలాస మండలం శాసనంగ్రామంలోని వెల్డింగ్ షాపులోకి ప్రవేశించింది. గాయంతో విలవిలలాడుతున్న సైబీరియాకు చెందిన పెలికాన్ (గూడ బాతు)ను చూసిన స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న కాశీబుగ్గ అటవీ శాఖ అధికారులు రాజు, కృష్ణారావు లతో పాటు ఈస్టర్న్ ఘాట్ వైల్డ్ లైఫ్ సొసైటీ కి చెందిన ఓంకార్ త్యాడి గాయపడిన పెలికాన్ ను వెటర్నరీ ఆస్పత్రికి తరలించారు.


పెలికాన్ పక్షికి పశుసంవర్ధక శాఖ సహాయక అధికారి డా.పోతనపల్లి చంద్ర శేఖర్ ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం పెలికాన్ నుబోనులో బంధించిన ఫారెస్ట్ అధికారులు పలాస సమీపంలోని అటవీ ప్రాంతంలో విడిచి పెట్టారు.

# రాజకీయ ప్రయోజనాల కోసమే అక్రమ కేసులు

**-అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం**

**-అక్రమ కేసులో బాధితులైన శ్రీజగన్నాథపురం**

**వైసీపీ నాయకులను పరామర్శించిన తిలక్**



**సంతబొమ్మాళి, మే 13(వార్త):** రాజకీయ ప్రయోజనాల కూటమి కోసమే వైయస్సార్సీపి నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని ఎవరు అధైర్యపడవద్దని, ప్రతి ఒక్కరికి అండగా ఉంటామని వైఎస్ఆర్సిపి టెక్కలి నియోజకవర్గ ఇన్చార్జ్ పేరాడ తిలక్ భరోసా ఇచ్చారు. ఇటీవల తెలుగుదేశం కూటమి నాయకులు పెట్టిన అక్రమ కేసుల్లో అరెస్టై బెయిల్ పై విడుదలైన సంతబొమ్మాళి మండలం శ్రీ జగన్నాథపురం గ్రామ సర్పంచ్ రాములమ్మ వైఎస్ ఆర్సిపి నాయకులు ఎల్.రామారావు, కె.రామారావు కుటుంబ సభ్యులను మంగళవారం తిలక్ పరామర్శించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి అచ్చన్నాయుడు ప్రోత్సాహంతో పోలీసులు వైఎస్ఆర్సిపి నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. శ్రీజగన్నాథపురం లో టిడిపి వర్గాల మధ్య జరిగిన గొడవల్లో వైఎస్ఆర్సిపి మహిళ సర్పంచ్ పైన గ్రామంలో లేని వైఎస్ఆర్సిపి కార్యకర్తల పైన కేసులు బనాయించడం హేయమైన చర్యని అన్నారు. అక్రమ కేసులు బనాయిస్తున్న వారు, వీటికి ప్రోత్సహిస్తున్నవారు తగిన మూల్యం చెల్లించకోక తప్పదని తిలక్ హెచ్చరించారు. రాబోయేది వైఎస్ఆర్సిపి ప్రభుత్వం అని, జగన్మోహన్ రెడ్డి గారు ముఖ్యమంత్రి అయిన తర్వాత అన్యాయంగా వైఎస్సార్సీపీ కార్యకర్తలను నాయకులు ఇబ్బందులు పెడుతున్న వారిని వదిలిపెట్టేదే లేదని అన్నారు. జగన్మోహన్ రెడ్డి గారిని ముఖ్యమంత్రిని చేసుకునేందుకు గాను కార్యకర్తలకు ఎన్ని ఇబ్బందులు పెట్టినా, ఎన్ని కేసులు పెట్టిన ధైర్యంతో ముందుకెళ్లి కూటమి ప్రభుత్వంపై పోరాటం చేయడం జరుగుతుందని, కార్యకర్తల కోసం తాను నిరంతరం అండగా ఉండి వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని ఎవరు అధైర్య పడొద్దని తిలక్ కోరారు. ప్రశాంతంగా ఉన్న తీర ప్రాంతంలో రాజకీయ కక్షలకు ప్రోత్సహించడం తగదన్నారు.

కార్యక్రమంలో మండల వైసీపీ పార్టీ అధ్యక్షుడు బుడ్డా మోహన్ రెడ్డి,మాజీ ఏ.ఎం. సి చైర్మన్ సుగ్గు రామిరెడ్డి, వైసీపీ జిల్లా నాయకులు ఎన్ని మన్మథ రావు,నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామ మూర్తి, టెక్కలి ఎంపీపీ ప్రతినిధి ఆట్ల రాహుల్, కోట బొమ్మాళి జడ్పీటీసీ దుబ్బ వెంకట రావు, సంత బొమ్మాళి, టెక్కలి, నందిగాం, కోటబొమ్మాళి వైఎస్ ఆర్సిపి మండలాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## కొత్తూరు ప్రిన్సిపాల్‌గా ధనుంజయ రావు

**కొత్తూరు, మే 13 (వార్త):** కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా ఇంటర్మీడియట్ విద్యాశాఖ కమీషనర్ ఆదేశాల మేరకు గణపతి దనుంజయరావుని నియమించారు. ఈయన ఆముదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల బోటనీ లెక్చరర్‌గా పనిచేస్తూ పదోన్నతి ద్వారా కొత్తూరు కళాశాలకు ప్రిన్సిపాల్‌గా బదిలీ అయ్యారు. మంగళవారం ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్బంగా కళాశాల పూర్వపు ప్రిన్సిపాల్ బండారు రవి కుమార్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ధనుంజయరావుకు స్వాగతం పలుకుతూ పుష్పగుచ్ఛం సమర్పించి అభినందించారు.

## ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై అవగాహన




**కొత్తూరు, మే 13 (వార్త):** వమాకవరం యూనిట్ అల్తి గిరిజన గ్రామంలో ఏ.పీ.సీ.ఎన్.ఎఫ్, డిపిఎం పూజారి సత్యన్నారాయణ ఆదేశాలు మేరకు గ్రామ సర్పంచ్ మరియు ఐసీఆర్పీ లు ధనలక్ష్మి,వెంకటరావు ఆధ్వర్యంలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా గ్రామ సభను మంగళవారం నిర్వహించారు. రైతులందరితో కలిసి గ్రామంలోని వీధుల్లో ర్యాలీ చేశారు. అనంతరం ఆదర్శ రైతులకు నలుగురిని వారు ప్రకృతి వ్యవసాయం లో ప్రగతి సాధించిన పనితీరును గుర్తిస్తూ వారికి చిరు సన్మానాలు చేశారు..ముఖ్యంగా పి.ఎం.డి.ఎస్ నవధాన్యాలు సాగు వల్ల కలిగే ఉపయోగాలు రైతులకు తెలియజేసి వరి పంట ఎదలో ఎలా పిఎండిఎస్ వేసుకోవాలి, వరి దమ్ములో ఎలా వేసుకోవాలో రైతులకు వివరించారు. ప్రతి ఒక్క రైతు కూడా ప్రకృతి వ్యవసాయం చేసి ముందుండి నడిపించాలని రైతులకు చెప్పటం జరిగింది. కార్యక్రమానికి సర్పంచ్ ఏలిసోని, ఐసీఆర్పీలు ధనలక్ష్మి, వెంకటరావు, ఎఫ్.ఎ భీముడు, భీమరాజు, రైతులు హాజరయ్యారు.

## ఆదినారాయణకు జాతీయ పురస్కారం




**శ్రీకాకుళం, మే 13 (వార్త):** హిందీ భాషాఅభివృద్ధి సేవలకు గాను విశ్రాంత హిందీ ఉపాధ్యాయుడు డా. ముద్దాడ ఆదినారాయణను ఇంటర్నేషనల్ సోషల్ అవార్డు వేడుక ప్రెస్ క్లబ్ వెల్ఫేర్ వరల్డ్ వైడ్ ఫౌండేషన్ వారు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారంతో సత్కరించారు.

## రక్తదానంతో ప్రాణదాతలు కండి

**శ్రీకాకుళం, మే 13 (వార్త):** ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు రవిశంకర్ గురూజీ జన్మదిన సందర్భంగా మంగళవారం ఎఒఎల్ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా ..ఒకరి రక్తదానంతో ముగ్గురికి ప్రాణదానం చేయగల రక్తదాన శిబిరం నిర్వహణకు గురూజీ శిష్యులు ముందుకు వచ్చారు. ఇండియన్ రెడ్ క్రాస్ సెంటర్ లో జరిగిన ఈ కార్యక్రమానికి రెడ్ క్రాస్ చైర్మన్ వి.జగన్మోహన రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యులు రక్తదానం చేయడం ద్వారా గురు దక్షిణ సమర్పించుకుంటున్నారని, ఇది అన్ని దానాల్లో గొప్పదిగా కొనియాడారు. ప్రముఖ న్యాయవాధి టి. సూధారాణీ మాట్లాడుతూ కరోనా తరువాత రక్తదాతలు తగ్గడం బాధాకరమన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అవకాశమున్న వారందరూ రక్తదానం చేయాలని పిలుపు నిచ్చారు. డిడిసి సభ్యులు బి వి రవిశంకర్, శిల్లా రమేష్ మాట్లాడుతూ ఆరోగ్య భారతావనికి ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ చేస్తున్నా కృషిని వివరించారు. పెంకి చైతన్య కుమార్ నిర్వహణలో జరిగిన ఈ రక్తదాన శిబిరంలో బి వి రవిశంకర్, కొరారి ఆదినారాయణ, వి సచ్చిన్, టి.జోగారావు తదితరులు రక్తదానం చేశారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## అంగన్వాడీ కేంద్రాల్లో కిశోర వికాసం



**ఇచ్ఛాపురం, మే 13(వార్త):** ఐ సి డి ఎస్ ప్రాజెక్ట్ ఇచ్చాపురం మండలం లో అంగన్వాడీ కేంద్రాలలో కిషోరి వికాసం సమ్మర్ స్పెషల్ కాంపెయిన్ లో భాగంగా 15 నుండి 18 సంవత్సరాల కిషోర బాలికలకు సమావేశం నిర్వహించడం జరిగింది. సెషన్ లో భాగంగా 'బాలల హక్కులు రక్షణ పొక్సో చట్టం గురించి అవగాహన ' కల్పించడం జరిగింది.సూపర్ వైజర్ లు మరియు కిషోరి వికాస గ్రామ కమిటీ లో సభ్యులైన ఆశా, ఏ ఎన్ ఎం వెలుగు సభ్యురాలు అంగన్వాడీ టీచర్ లుఈ కార్యక్రమం లో పాల్గొనడం జరిగింది.



## అల్లిమెరకలో పోస్ట్ వాక్సినేషన్

**మందస, మే 13(వార్త):** జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం ద్వారా మార్చి, ఏప్రిల్ నెలలో రాష్ట్రవ్యాప్తంగా ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించడం జరిగింది. టీకాల క్షేత్రస్థాయి నిర్వహణను తెలుసుకోవడానికి గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆదేశానుసారం ప్రతి డివిజన్ నుంచి రేండంగా ఒక గ్రామాన్ని ఎంపిక చేసి, ఎంపిక చేసిన గ్రామంలో గల పశు వుల నుంచి రక్త నమూనాలను సేకరించి ల్యాబ్ లో పరీక్షించడం ద్వారా క్షేత్రస్థాయి టీకాల నిర్వహణను నిర్ధారించడం జరుగుతుంది. ఈ ప్రక్రియలో టెక్కలి డివిజన్ లోని మందస మండలంలో ఉన్న అల్లిమెరక గ్రామాన్ని ఎంపిక చేయడం జరిగింది. ఎంపిక చేసిన గ్రామంలో డాక్టర్ పి.రమాదేవి, అసిస్టెంట్ డైరెక్టర్, క్వాలిటీ అనలిటికల్ లేబరేటరీ, విశాఖపట్నం, డాక్టర్ ఆర్.కిషోర్, యానిమల్ డిసీస్ డయాగ్నొస్టిక్ లేబరేటరీస్, శ్రీకాకుళం ఆధ్వర్యంలో రక్తనమూనాలను సేకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మందస మండల పశువైద్యాధికారి డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్, సిబ్బంది లక్ష్మి, సంతోషి, శ్రీను, తిరుపతి పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు మహిళ మృతి




**కొత్తూరు, మే 13 (వార్త):** అడ్డంగి పంచాయతీ, దిగువ ముల్లెలగూడ గ్రామానికి చెందిన సవర చిన్నారమ్మ ఆదివారం సాయంత్రం మేకలు కాస్తుండగా ప్రమాదవ శాత్తు పిడుగుపాటు గురై మృతి చెందింది. దీనిపై ఆమె సోదరుడు సవర. రాజారావు కొత్తూరు పోలీస్ స్టేషన్‌కి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

## ఇచ్ఛాపురం కళాకారులకు సత్కారం



**ఇచ్ఛాపురం, మే 13(వార్త):** పద కవితా పితామహులు తాళ్లపాక అన్నమాచార్యుల జయంతి వైశాఖ పౌర్ణమి శుభ సందర్భంగా కవిటి మండలం ముత్యాల పేట గ్రామంలో వెలసి ఉన్న అమృత వర్షిని సమేత మృత్యుంజయశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగిన శుభ సందర్భంగా రాత్రి ఏర్పాటుచేసిన సంగీత విభావరి అందరినీ ఆకట్టుకుంది. వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ కళాబృందం మాస్టర్ చిన్నా గురు స్వామి బృందం అనపాన మణికుమారి హేమంత్ కుమార్ బాడిత్య నిత్యానంద బాడిత్య పాల్గొని పలు అన్నమయ్య సంకీర్తనలు రామదాసు కీర్తనలు శివ కీర్తనలతో గానం చేసి అందరిని అలరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు .ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్ మాస్టర్ ఆలయ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొని కళాకారులకు ఘనంగా సత్కరించారు.

## టీడీపీ కమిటీల నియామకాలు

**ఇచ్ఛాపురం, మే 13(వార్త):** మండలం లో తెలుగుదేశం గ్రామ కమిటీ ల ఎన్నిక జరిగింది.ఆరకపద్ర తెలుగుదేశం కమిటీ అధ్యక్షుడిగా రంగాల ధర్మారావు, పాయి తారీ అధ్యక్షుడుగా వలపల నిరంజన్, కీర్తిపురం అధ్యక్షుడు గా గిన్నీ బాలరాజు, కొలిగంనకు ప్రతాప్ మండలో, బొడ్డ బడా జ్యోత్న బేహారా, కేసుపురం పిట్ట పురు షోత్తం, ఈదుపురంనకు అంబటి ఈశ్వరరావు, హరిపురంనకు వడ్డేన ధర్మరాజును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో దక్కత ఢిల్లీరావు, మెరుగు సూర్యనారాయణ, లోపింటి పద్మనాభం, దక్కాత శ్రీనివాస్, రెడ్డి రామారావు తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్ర స్థాయిలో సత్తా చాటిన పైల కీర్తన

**మందస, మే 13(వార్త):** ఇటీవల విడుదలైన డా.బి.ఆర్ అంబేద్కర్ గురుకులాల కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఇంటర్ విభాగం)లో కొత్తపల్లి ఉన్నత పాఠశాల నుండి 10వ తరగతి పూర్తి చేసుకున్న పైల కీర్తన రాష్ట్ర స్థాయిలో 31 వ ర్యాంక్ సాధించింది. ఈ టెస్ట్ లో 1/3వంతు నెగిటివ్ మార్కులు ఉన్నప్పటికీ, కీర్తన మొత్తం 100 మార్కులకు 82 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబర్చడం పట్ల కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాతశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు ఎస్.గణేశ్వరరావు, పాఠశాల సిబ్బంది, కీర్తనను ప్రత్యేకంగా అభినందించారు. ఎస్ఎస్సీ ఫలితాల్లో కూడా ఆమె 590 మార్కులతో సత్తా చాటింది. ఈ సందర్భంగా ఆమెను ప్రత్యేకంగా అభినందించిన వారిలో ఉపాధ్యాయులు జి.భీమారావు, ఎం.లక్ష్మణరావు, ఎం.కిరణ్ కుమార్, ఎస్.అబ్రహం, పి.రాంబాబు, ఎం. చిత్రసేను, ఎం.దామోదరం, జి.గోపాలకృష్ణ, బి.రమేష్, స్థానిక పెద్దలు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు ఉన్నారు.



# సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



**మందస, మే 13(వార్త):** ఈనెల 20న జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. స్థానిక అంబేద్కర్ భవనంలో సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె సన్నాహక సదస్సు సీఐటీయూ మండల కన్వీనర్ కె.కేశవరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, విఆర్ఏ సంఘం నాయకుడు పి.శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకుడు ఎం.ధర్మారావు మాట్లాడుతూ లేబర్ కోడ్ లు రద్దు, కనీస వేతనాలు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, అసంగటిత రంగ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు, నిత్యావసర సరుకులు ధరలు తగ్గింపు, స్కీమ్ వర్కర్లకు ఉద్యోగులుగా గుర్తింపు వంటి డిమాండ్లతో ఈ సమ్మె జరుగుతుందని వివరించారు. సమ్మెలో కార్మిక వర్గం, ఉద్యోగులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సదస్సులో ఎ.క్రిష్ణారావు, బి.వెంకటేశం, ఎస్.జగ్గారావు, కె.తాతయ్య, ఎన్.రమేష్, జె.గంగాభవాని, కె.మోహనరావుతో పాటు వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.

**పలాస, మే 13(వార్త):** ఈనెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ, ఐ యఫ్ టి యు, ఏఐసిసిటియు, నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సమ్మె సన్నాహక సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్ లు వల్ల కార్మిక వర్గం బానిసత్వం లోకి నెట్టేయ బడతారని అన్నారు. ఈ సమ్మె ద్వారా లేబర్ కోడ్ లు రద్దు కోసం పోరాటానికి సిద్ధం చేయాలని కోరారు.కనీస వేతనాలు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, అసంగటిత కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు, స్కీమ్ వర్కర్ల ను ఉద్యోగులుగా గుర్తింపు, వంటి సమస్యలపై ఈ సమ్మె జరుగుతుందని తెలిపారు. కార్మికులు అంతా ఈ సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్ గణపతి, ఏ ఐ సి సి టి యు నాయకులు కె దుష్యంత్, కె లోకనాదం, ఏ ఐ కె యం యస్ నాయకులు వి మాధవరావు, ఏ ఐ కె యం నాయకులు పి కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.




# పరస్పర అంగీకారంతో కుదిరిన వేతన ఒప్పందం



**పలాస, మే 13(వార్త):** పరస్పర అంగీకారంతో క్యాజు మ్యానుఫ్యాక్చర్ అసోసియేషన్, క్యాజు లేబర్ అండ్ రైస్ మిల్లర్స్ యూనియన్‌కి మధ్య వేతన ఒప్పందం మంగళవారం కుదిరింది.

అధ్యక్షులు మల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన యాజమాన్యం, కార్మిక సంఘం వారికి 2025- 27 సంవత్సరమునకు ఇరు సంఘాల పరస్పర అంగీకారంతో అంగీకర పత్రం విడుదల చేశారు.

బాయిలింగ్ వేసే వారికి 68. 90 పైసలుగా ఉన్న బస్తా ఒక్కంటికి 71.00 రూపాయలు గాను, జీడి పిక్కలు కటింగ్ చేసే వారికి 33.60 పైసలుగా ఉన్న కేజీ ఒక్కంటికి 34 రూపాయలుగాను, ఫీలింగ్ చేసే వారికి 12:35 పైసలుగా ఉన్న కేజీ ఒక్కంటికి 12.50పైసులుగాను, జీడిపిక్కలు ఎండబోతకు 37 రూపాయలుగా ఉన్న బస్తా ఒక్కంటికి 43 రూపాయలుగా ఇచ్చుటకు, మిగతా అన్ని రకాల పనులకు 2023-2025 సంవత్సరంలో ఇచ్చినటువంటి వేతనం కంటే బేసి రేటుకి 10% పెంచుటకు ఇరు సంఘాల యూనియన్ నాయకుల మధ్య అంగీకారం చేసుకున్నారు. ఇందుకుగాను సహకరించిన కార్మిక సంఘ కార్యవర్గానికి, స్థానిక శాసనసభ్యురాలు గౌతు శిరీషకి ఇరు సంఘాల తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాజు లేబర్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు అంబటి కృష్ణమూర్తి, భీమారావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## జవహర్ నవోదయ విద్యార్థుల ప్రతిభ

**-సీబీఎస్ఈ ఫలితాల్లో శత శాతం ఉత్తీర్ణత**

**శ్రీకాకుళం/సరుబుజ్జిలి, మే 13(వార్త):** జవహర్ నవోదయ విద్యాలయాల విద్యార్థులు సీబీఎస్ఈ పదో, 12 తరగతుల ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ ప్రదర్శించారు. శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండలంలోని వెన్నెలవలసలో ఉన్న జేఎన్వీలో పదో తరగతిలో 79 మంది పరీక్షలకు హాజరై 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 81 మంది విద్యార్థులు రిజిస్టర్ అయి ఉండగా, ఇద్దరు (ఒక అబ్బాయి, ఒక అమ్మాయి) తీవ్ర అనారోగ్యం కారణంగా హాజరుకాలేకపోయినట్లు ప్రిన్సిపాల్ పరశురాం తెలిపారు. స్కూల్ సగటు మార్కులు 80.7 శాతం కాగా, తెలుగు 86.22%, హిందీ 81.71%, సైన్స్ 81.73% సగటుతో మెరుగైన ఫలితాలు నమోదయ్యాయి. ఇక 12వ తరగతి ఫలితాల్లోనూ జేఎన్వీ విద్యార్థులు రికార్డు స్థాయిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 34 మంది (24 అబ్బాయిలు, 10 అమ్మాయిలు) పరీక్షలు రాసి అందరూ ఉత్తీర్ణులయ్యారు. ఇంగ్లిష్ 81.09%, కెమిస్ట్రీ 79.76%, కంప్యూటర్ సైన్స్ 79.82% సగటు మార్కులతో విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. ఈ విజయాలకు కారణమైన టీచర్లు, సిబ్బందికి ప్రిన్సిపల్ పరశురాం కృతజ్ఞతలు తెలిపారు.

# నేటి నుంచి పలాసకు ఉద్దాన ప్రాజెక్టు నీరు

**-రూ.65లక్షలతో పూర్తయిన పనులు**

**-పురపాలక ప్రజలకు నిరంతర తాగునీరు**

**- ప్రారంభించనున్న ఎమ్మెల్యే గౌతు శిరీష**



**పలాస, మే 13(వార్త):** దశాబ్దాల కాలం నుంచి పలాస పరిపాల సంఘానికి తాగునీటి సమస్య వెంటాడుతూనే ఉంది. ఎందరో పాలకులు వచ్చారు వెళ్లారు కానీ ఇక్కడ ప్రజల కోసం కనీస అవసరమైన త్రాగునీరు అంటించేందుకు శాశ్వత పరిష్కారాలు చేయలేకపోయారని విమర్శలున్నాయి. వేసవికాలం వస్తే చాలు ట్యాంకులు ద్వారా నీళ్లు ఇస్తారా లేదా ఎదురుచూసే పురపాలక సంఘ ప్రజలకు ప్రస్తుతం ఉద్దాన ప్రాజెక్ట్ నుంచి త్రాగునీటినందించేందుకు వీలుగా 65 లక్షలుతో జలసిరి ప్రాజెక్టును ఏర్పాటు చేశారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కృషి మేరకు ఎట్టకాలకు పురపాలక ప్రజలకు తాగునీరు అందుబోతుంది. ఇందుకోసం ఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమం ఈనెల 14వ తేదీన నిర్వహించినట్టుగా అధికార వర్గాలు ఓ ప్రకటనలు వెల్లడించాయి. ప్రాజెక్టు పనులు చురుకుగా సాగుతున్నాయి. జలసిరి నీటి పథకం ప్రారంభోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష తో పాటు అలాగే మున్సిపల్ చైర్మన్ బల్ల గిరి బాబు అలాగే మున్సిపల్ కమిషనర్ ఎన్. రామారావు తో.పాటు ఇతర అధికారులు హాజరవుతున్నట్టుగా నిర్వాహకులు తెలిపారు.

# ప్రకృతి వ్యవసాయ విధానాలే శరణ్యం



**సంతబొమ్మాళి, మే 13(వార్త):** ఆరోగ్యవంతమైన అహారోత్పత్తికి రాబోవు కాలంలో ప్రకృతి వ్యవసాయ విధానాలే శరణ్యమని సంతబొమ్మాళి మండల వ్యవసాయాధికారి రాళ్లపేట అప్పారావు రైతులకు ఉద్బోధించారు.. మండలంలోని గోవిందపురం రైతుసేవాకేంద్రం పరిధి సవరపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో భాగమైన నవధాన్యాల సాగుపై చర్చా కార్యక్రమంలో పాల్గొని పలుసూచనలు చేశారు. వినియోగదారుల్లో రసాయన రహిత సేద్యపు ఉత్పత్తులపై మక్కువ పెరుగుతున్న దృష్ట్యా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు గిరాకీ రాబోతుందని తద్వారా ప్రకృతి వ్యవసాయం లాభసాటి కాబోతోందని తెలిపారు. మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ రెడ్డి అప్పన్నగారు మాట్లాడుతూ గ్రామం నుండి ప్రకృతి వ్యవసాయం చేయుటకు రైతులు ముందుకు రావడం శుభపరిణామం అన్నారు. గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానాలు విజయవంతంగా ఆచరిస్తున్న అభ్యుదయ రైతులు తెలుగు భీమారావు మరియు గొండు కన్నయ్య లను సన్మానించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు కింజారాపు ఉష, తంగి విజయ, తంగి వేణమ్మ మరియు వ్యవసాయ సహాయకుడు వాడాల బాలకృష్ణ మొదలగువారు పాల్గొన్నారు..

# హ్యాండ్‌బాల్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం

**-జిల్లా అధ్యక్షులుగా లక్ష్మణరావు,,**

**కార్యదర్శిగా రవిశేఖర్**

**- అభినందనలు వెల్లువ**




**శ్రీకాకుళం స్పోర్ట్స్, మే 13 (వార్త):** జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా అధ్యక్షులుగా దుంపల లక్ష్మణరావు, కార్యదర్శిగా కుప్పిలి రవిశేఖర్ ఎన్నికయ్యారు. శ్రీకాకుళంలోని జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ కార్యాలయంలో నిర్వహించిన హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అసోసియేషన్ తరపున పరిశీలకుడుగా గోపి,డిఎస్‌ఏ తరపున లక్ష్మణ్, ఒలింపిక్ అసోసియేషన్ తరపున సుందరరావు మాస్టార్ తదితరులు హజరయ్యారు. అందరి ఏకాభిప్రాయంతో శ్రీకాకుళం జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా దుంపల లక్ష్మణరావు,కార్యదర్శిగా కుప్పిలి రవిశేఖర్‌ను ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షులుగా శేఖర్, సింగ్, గౌరిశంకర్, సంయుక్త కార్యదర్శులుగా రవిబాబు, ఈశ్వరరావు,హరీష్ నాయుడులు కోశాధికారిగా రాజశేఖర్ లతో పాటు ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా పలువురు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం నాలుగేళ్ల పాటు కొనసాగుసుంది. శ్రీకాకుళం హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులుగా ఎన్నికైన దుంపల లక్ష్మణరావు,కుప్పిలి రవిశేఖర్ లతో పాటు ఇతర సభ్యులందరిని కూడా హ్యాండ్ బాల్ సీనియర్ క్రీడాకారులు అభినందించారు. జిల్లాలో హ్యాండ్ బాల్ క్రీడ అభివృద్ధికి క్రీడాకారులు రాష్ట్ర,జాతీయ స్థాయి పోటీలలో రాణించేందుకు నూతన కార్యవర్గం కృషి చేయాలని వారంతా ఆకాంక్షించారు.




## రైతు సంఘాల ద్వారా జీడి పిక్కల సేకరణ

**మందస, మే 13(వార్త):** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఏర్పాటు చేసిన వన్ ధన్ వికాస కేంద్రాలు సమర్థవంతంగా నిర్వహించడానికి గ్రామాలలో రైతు సంఘాల ద్వారా జీడి పిక్కల సేకరణ పారదర్శకంగా జరగాలని మందస వెలుగు ఐటిడిఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు సూచించారు. స్థానిక మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోర్డు ఆఫ్ డైరెక్టర్లు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా మహిళా సంఘాల సభ్యులలో ఆదాయ అభివృద్ధి మెరుగు పడాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన వి.డి.వి.కె. కేంద్రాలకు రైతులు ఉత్పత్తి చేసిన జీడిపిక్కలు ను వారికి గిట్టుబాటు ధర వచ్చేటట్లు ఎఫ్ .పి. ఓ. ల ద్వారా సేకరించాలని బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల అందరికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్.పి.ఓ. అకౌంటెంట్ కృష్ణకుమారి, మండల సమాఖ్య ప్రతినిధులతో పాటు ఎం.ఎం.ఎస్. అకౌంటెంట్ కళ్యాణి, క్లస్టర్ కోఆర్డినేటర్లు తారక మోహన్, స్వామినాయుడు, ముఖలింగం, బాలకృష్ణ, మంగమ్మ, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

## వెంకటగిరి హ్యాండ్లూమ్ టెక్నాలజీ ఇనిస్టిట్యూట్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

**శ్రీకాకుళం, మే 13 (వార్త):** వెంకటగిరిలో గల శ్రీ ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజి, వెంకటగిరి, తిరుపతి జిల్లాలో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఓఎస్డీ ఎస్. గిరిధదరావు మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజిలో 53 సీట్లకు, తమిళనాడులోని సేలం నందు 12 సీట్లకు, కర్నాటకలోని గదగ్ లో 4 సీట్లకు 3 సంవత్సరముల హ్యాండ్లూమ్ అండ్ టెక్స్టైల్ టెక్నాలజి డిప్లొమా కోర్సులో ప్రవేశం కొరకు దరఖాస్తులు ఆహ్వానించియున్నారు. ఇందుకు విద్యార్థులు 10వ తరగతి లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలని, జూలై 1 నాటికి బిసి, జనరల్ కేటగిరిలకు 15 నుండి 23 సంవత్సరాల మధ్య ఉండిలని, ఎస్సీ, ఎస్టీ ల వారికి 25 సంవత్సరాల వయసు ఉండొచ్చని వివరించారు. లేటరల్ ఎంట్రీ మూడు సంవత్సరాల డి.హెచ్.టి.టి కోర్సులో, ఇంటర్మీడియట్ ఎంపిసి, ఇంటర్మీడియట్ ఒకేషనల్ (టెక్స్టైల్స్), ఐటీఐ (2 సంవత్సరములు) కోర్సులందు ఉత్తీర్ణులైన అభ్యర్థులకు నేరుగా డిప్లొమా రెండవ సంవత్సరంలో ప్రవేశం నిమిత్తం దరఖాస్తులు ఆహ్వానించబడుచున్నవి. దరఖాస్తులు మరియు ప్రవేశాలు - ప్రతి సంవత్సరం మే/జూన్ మాసంలో ఉంటాయన్నారు. ఇతర వివరములు మరియు దరఖాస్తు పొందుట కొరకు www.iihtvgr.com వెబ్సైట్ చూడగలరు. ఉచిత శిక్షణ అప్పరెల్ %d% గార్మెంట్ మేకింగ్ టెక్నాలజిలో ఉంటుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఏప్రిల్ 24వ తేది నుండి వెబ్ సైట్ ఓపెన్ లో ఉందని జూన్, 1తో చివరి తేదీ అని తెలిపారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. 08625-295003, 9399936872, 9866169908, 9010243054 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

## 10 మద్యం సీసాల పట్టివేత




**కొత్తూరు, మే 13 (వార్త):** కొత్తూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎం.డి. అమిర్ అలీకి వచ్చిన సమాచారం మేరకు, తన సిబ్బందితో కలిసి పారాపురం గ్రామం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా , బమ్మిడి గ్రామ వాసి దివిలి తిరుపతిరావు 10 మద్యం సీసాలతో పట్టుబడ్డాడు. ఆయనపై కేసు నమోదు చేశారు. త

# సైనికుల త్యాగాలు, కుటుంబసభ్యుల సహకారం వెలకట్టలేనివి

**- జేసీఐ శ్రీకాకుళం సన్ రైజర్స్ అధ్యక్షుడు సింగూరు ప్రవీణ్**

**శ్రీకాకుళం, మే 13 (వార్త):** దేశానికి సైనిక త్యాగాలు, వారి కుటుంబ సభ్యుల సహకారం వెలకట్టలేనివని, జేసీఐ శ్రీకాకుళం సన్ రైజర్స్ అధ్యక్షులు సింగూరు ప్రవీణ్ సోమవారం అన్నారు. జేసీఐ శ్రీకాకుళం సన్ రైజర్స్ ఆధ్వర్యంలో స్థానిక వి.కె. క్లినిక్ ప్రాంగణంలో మదర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. దేశ రక్షణ కోసం అహర్నిశలు కృషిచేసే సైనికుల తల్లులు, వారి జీవిత భాగస్వాములను ఈ సందర్భంగా సన్మానించడం ఈ కార్యక్రమానికి ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అధ్యక్షులు జెహెచ్ఎం ప్రవీణ్ కుమార్ సింగూరు మాట్లాడుతూ దేశ సేవలో అగ్రభాగాన నిలిచిన జవాన్ల తల్లులు, భార్యలను గౌరవించడం మా అదృష్టంగా భావిస్తున్నామని, ఈ కార్యక్రమం ద్వారా వారి త్యాగాలను గుర్తు చేసుకోవడం మా బాధ్యతన్నారు. సైనికులు సరిహద్దులపై దేశాన్ని రక్షించడంలో నిరంతరం శ్రమిస్తుంటే, వారి కుటుంబాలు మౌనంగా వీర జెండాలు ఎగురవేస్తూ దేశానికి అండగా నిలుస్తున్నారన్నారు. ఒక్కో తల్లి తన కుమారుడిని దేశానికి అర్పించి గర్వంగా నిలుస్తుందని, ఒక్కో భార్య తన భర్త సురక్షితంగా తిరిగొస్తాడనే ఆశతో ప్రతి రోజు ధైర్యంగా ఎదుర్కొంటుందన్నారు. వీరుల వెనుక కనిపించని వీరులు, వాళ్ల కుటుంబ సభ్యులని పేర్కొన్నారు. మాతృమూర్తులు లక్ష్మీ చలం, రాధా రాణి, పద్మావతి, విజయలక్ష్మి, ప్రమీల, భారతి, లక్ష్మిలను సత్కరించడం జరిగిందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన సన్ రైజర్స్ సభ్యులకు, హాజరైన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా జోన్ కోఆర్డినేటర్ జేసీ ప్రవీణ్ బగాది , ప్రత్యేక అతిథిగా జేసీ వరలక్ష్మి బెండాళం హాజరై, సైనిక కుటుంబాల సేవలను కొనియాడుతూ వారి త్యాగాలను గుర్తు చేసుకున్నారు. ఈ



కార్యక్రమంలో జేసీ సెనేటర్ డా. వినోద్ కుమార్ కూర్మాన, చార్టర్ ప్రెసిడెంట్ జెఎఫ్పీ సంతోష్ దూసి, వైస్ ప్రెసిడెంట్ జేసీ శర్మిల, జేసీఐ శ్రీకాకుళం మెయిన్ కార్యదర్శి తమ్మినేని ఉషారాణి, సభ్యులు ఉర్లం.శివతేజ తదితరులు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546